సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 118 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం | 31.08.2025




5 లో



## కష్టపడి చదవితే.. మంచి భవిష్యత్తు

- పదిలో మంచి మార్కులు సాధించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2 లో



## బ్రోనో.. బైబై..!

### పోలీస్ జాగిలానికి పదవీ విరమణ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో 12 వసంతాలు సేవలందించిన పోలీస్ జాగిలం 'బ్రోనో'కు పోలీస్ అధికారులు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సుధీర్ఘ కాలంగా సేవలందించిన బ్రోనోను ఘనంగా సత్కరించారు. ట్రాకర్ జాగిలంగా గుర్తించబడిన బ్రోనో పోలీస్ శాఖలో చేరిన నాటి నుంచి 15 కేసులు నిందితులను గుర్తించడంతో పాటు జాతీయ పోలీస్ డ్యూటీ మీట్లలో పలు పతకాలను సాధించింది. బ్రోనో శిక్షకుడిగా హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ వ్యవహరించారు.

- మన చౌరాస్తా, వరంగల్



# యూరియా కోసం రోడ్డెక్కిన్రు

## చెన్నారావుపేటలో బీఆర్ఎస్ ధర్నా

**నర్సంపేట, మన చౌరాస్తా :** రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చెన్నరావుపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వ విఫలమైందన్నారు. రైతులకు బాకీ ఉన్నా సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణంగా చేయాచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారెంటీలను పక్కా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

## అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్, ఇంచార్జ్ డీఈవో పింకేష్ కుమార్ అన్నారు. శనివారం జనగామ మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ రికార్డ్స్ పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదును అడిగి తెలుసుకున్నారు. అధికారులతో పర్యవేక్షిస్తూ పాఠశాల ఆవరణ, వంట గదిలను సందర్శించి పరిశుభ్రతను చెక్ చేశారు. వృథా సామాగ్రిని తొలగించాలని ఆదేశించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. పిల్లల సదుపాయాలలో ఏమైన ఇబ్బంది ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ మెటీరియల్, స్పోర్ట్స్ రూమ్, లైబ్రరీ బుక్స్ షెల్ఫ్ మొదలైనవి పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ సక్రమంగా పంచేస్తుందా అని తెలుసుకున్నారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవో సంపత్ కుమార్ పాల్గొన్నారు.






# కష్టపడి చదవితే.. మంచి భవిష్యత్తు

- అభ్యాసన సామర్థ్యాలను పెంచుకోవాలి
- పదిలో మంచి మార్కులు సాధించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఇప్పుడు ఎంత కష్ట పడితే అంత మంచి భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యార్థులకు సూచించారు. శనివారం లింగాలఘణపురం మండలం నెల్లుట్లలోని జడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, అనంతరం పదవ తరగతి, ప్రి ప్రైమరీ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రి ప్రైమరీ తరగతిలోకి వెళ్లిన కలెక్టర్ బోర్డు మీద ఉన్న పదాలను విద్యార్థులకు భోదించి, వారితో చదివించారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు మెరుగయ్యే విధంగా ఉపాధ్యాయుల భోదన ఉండాలన్నారు. అనంతరం పదో తరగతి తరగతిలోకి వెళ్లిన కలెక్టర్ పిల్లల సామర్థ్యాలను



పరిశీలించారు. బాగా చదవాలని, ఇప్పటి నుండే ఒక ప్రణాళిక పెట్టుకుంటే ఫైనల్ పరీక్ష ల్లో మంచి మార్కులు వస్తాయన్నారు. అలాగే భోజనం బాగుంటుందా.. మెనూ ప్రకారం పెడుతున్నారా.. అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# శ్వేతార్క ఆలయంలో జంగా దంపతుల పూజలు

కాజీపేట, మన చౌరాస్తా : కాజీపేటలోని సుప్రసిద్ధ శ్రీశ్వేతార్క మూల గణపతి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగ కొనసాగుతున్నాయి. తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, సుజాత దంపతులు శనివారం గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజాలు చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని జంగా దంపతులు స్వామివారిని కోరుకున్నారు.




# కాలేజీని తనిఖీ చేసిన డీఐఈవో

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సిద్దిపేట డీఐఈవో కె.రవీందర్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన క్రీడా సామాగ్రిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ధారుడ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందని, విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ విద్యను అభ్యసించాలని కోరారు. కళాశాల రికార్డులను తనిఖీ చేసి, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికి సూచించారు. అనంతరం అధ్యాపక బృందంతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అడ్మిషన్ల సంఖ్య పెంచుకోవాలని అన్నారు.

# నేడు డయల్ యువర్ డీఎం

**హనుమకొండ, మన చౌరాస్తా :** డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఆర్టీసి డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. తమ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల ప్రజలు 8977781103కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి తమ విలువైన సూచనలను, సలహాలను అందించి డిపో అభివృద్ధికి సహకరించాలని డీఎం కోరారు.



# ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్‌గా స్రవంతి రెడ్డి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్‌గా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు బొక్కల స్రవంతి రెడ్డిని నియమించారు. తండ్రి ఈశ్వర్ రెడ్డి రాజకీయ వారసత్వాన్ని అందుకున్న స్రవంతి ముస్తఫాపూర్ ఎంపీటీసీగా రాజకీయ ఆరంగ్రేటం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ పిలుపు ఇచ్చినా గల్లి నుంచి ఢిల్లీ వరకు తన పోరాట పంథాను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 13 మంది కమిటీ సభ్యులుగా మొదటి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి వైస్ చైర్‌పర్సన్‌గా నియామకం అయ్యారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# అలుపెరుగని యోధుడు 'ఏచూరి'

**జనగామ, మన చౌరాస్తా :** సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి, కామ్రేడ్ సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాట యోధుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. ఏచూరి జయంతి ఉత్సవాల సందర్భంగా జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పూసల భవనంలో 'భారత రాజ్యాంగం.. -ఎన్నికలు.. బీజేపీ ప్రభుత్వం అక్రమంగా ఓట్ల తొలగింపు'పై సెమినారు నిర్వహించారు. అహల్య అధ్యక్షతన జరిగి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్బాస్ హాజరై మాట్లాడారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి భారతదేశ రాజకీయాల్లో విద్యార్థి దశ నుంచి చనిపోయేంత వరకు ఐదు దశాబ్దాల పాటు దేశానికి పార్టీకి సేవలు అందించిన మహానేత అని అన్నారు. ఆయన మూడుసార్లు జాతీయ కార్యదర్శితో పాటు రాజ్యసభలో కూడా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిలదీయడంతో పాటు దేశ అభివృద్ధికి అవసరమైనటువంటి అనేక సలహాలు సూచనలు ఇచ్చారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ 79 సంవత్సరాల భారత స్వతంత్ర దేశంలో బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన పద్ధతుల్లో ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తుందన్నారు. గతంలో ఓట్లేసి ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే నేడు బీజేపీ పార్టీ వారి వ్యతిరేక ఓట్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించి తనకు అనుకూలమైన ఓట్లు ఓటర్ లిస్టులో ఉంచుకొని ఓట్లు వేసుకొని అక్రమ పద్ధతులు అధికారం నిలబెట్టుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, జోగు ప్రకాష్, బెల్లంకొండ వెంకటేష్, పొత్కనూరి ఉపేందర్, కూడా నరేందర్, ఎండి అజారుద్దీన్, ఎండి షబానా, మునిగల రమేష్, బిట్ల గణేష్, శ్రీనివాస్, మండల కార్యదర్శులు గంగాపురం మహేందర్, గుండెబోయిన రాజు, మాచర్ల సారయ్య, ఇంటి వెంకట్ రెడ్డి, సాధం రమేష్, బొడ్డు కరుణాకర్, తూటి దేవదానం తదితరులు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా స్టాలిన్

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గా మండల కేంద్రానికి చెందిన గంధమల్ల స్టాలిన్‌ను నియమించారు. శనివారం బచ్చన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి స్టాలిన్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జిల్ల సందీప్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నీల రమేష్, యువ నాయకులు అఖిల్ మాల, బొట్టు సుధాకర్, పొన్నం శ్రీకాంత్, రసూల్ పాల్గొన్నారు.

## ముల్కనూర్ విద్యార్థి సిరి చందనకు రెండు బంగారు పతకాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన మోర సిరి చందన ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ (విద్యుత్ శాఖ) చదివి విశిష్ట ప్రతిభ కనబరచి రెండు బంగారు పతకాలు అందుకుంది. యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకల్లో వీసీ ప్రొఫెసర్ కుమార్ ములుగురం చేతుల మీదుగా ఈ బహుమతులను స్వీకరించింది. చందన యూనివర్సిటీ టాపర్‌గా ఒక బంగారు పతకం, ట్రిపుల్ ఈ శాఖలో ప్రథమ స్థానంలో నిలిచి మరో బంగారు పతకం పొందడం విశేషం. తన కృషి, పట్టుదలతో ఈ ఘనత సాధించి కుటుంబానికే కాక ముల్కనూర్ గ్రామానికి గౌరవాన్ని తెచ్చింది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు ముత్యం స్టూడియో కుమార్, లత దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.



# దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, మన చౌరాస్తా:** వృద్ధులు, దివ్యాంగులు ప్రత్యేక ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరంగా పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుంచి పలు దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### వైద్య శాఖ అధికారులతో సమీక్ష

జిల్లాలో అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. శనివారం తన చాంబర్‌లో వరంగల్ జిల్లాలో సీకేఎం, ఎంజీఎం, నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వర్ధన్నపేట ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేట సూపరింటెండెంట్లు, ఆర్ఎంఒలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలు తెలుసుకొని వాటిలో ఉన్న సమస్యలను అధిగమించడానికి పరిష్కార మార్గాలను తెలిపారు. సీకేఎం ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న సేవల్లో అంతరాయాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంజీఎం ఆసుపత్రికి రెగ్యులర్ సూపరింటెండెంట్ ఏర్పాటుకు డీఎంఈ హైదరాబాద్ వారితో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ కిషోర్, డిప్యూటీ డాక్టర్ మురళి, సీకేఎం హాస్పిటల్ ఇంచార్జ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఒ డాక్టర్ మురళి, నర్సంపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనదాస్, వర్ధన్నపేట హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడపితే రూ.లక్ష జరిమానా

- నాగిరెడ్డిపల్లి గ్రామస్తుల తీర్మానం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగితే రూ.లక్ష జరిమానా విధించాలని గ్రామస్తులు తీర్మానించారు. శనివారం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల కిష్టయ్యకు చెందిన పశువుకు బచ్చన్నపేట వైపు వెళ్తున్న ఊరి ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల సమాచారం ప్రకారం, మైనర్లు ట్రాక్టర్ నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు గ్రామ పెద్దలు, యువకులు సమావేశమై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై 18 సంవత్సరాలు నిండని వారు ఎలాంటి వాహనాలు నడపరాదని తీర్మానించారు. ఈ నిబంధనను ఉల్లంఘించి మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదం జరిగితే లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో మైనర్లు వాహనాలు నడిపితే వారి ఫోటోలను గ్రామ సమాచార వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసి, అవసరమైతే పోలీసులు చర్యలు తీసుకునేలా సమాచారం అందిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

## రిటైర్ ఉద్యోగులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, మన చౌరాస్తా :** పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సుదీర్ఘకాలం పని చేసి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను సీపీ శనివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు యాకుబ్ మొహినూద్దీన్, మహమ్మద్ అలీ, రాధేశ్యామ్ శర్మ, యాదగిరి, నందమచారి, ఏఎస్ఐలు జీలాని, సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు ముత్తయ్య, యాకుబ్ పాషా, శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 'మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తాయని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని, మీ అందించిన సేవలు మరువలేం..' అని పోలీస్ కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌తో పాటు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## రైతు సమస్యలు పరిష్కరించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ వ్యవసాయ గ్రెన్ మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ కోరారు. ఈ మేరకు శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ గ్రేన్ మార్కెట్ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మార్కెట్ కార్యదర్శి జి.జీవన్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం జనగామ వ్యవసాయ మార్కెట్ లో రైతులు పండించి మార్కెట్ కు విక్రయించడానికి తెస్తున్నారని, 2025-2026 మద్దతు ధరలకు వ్యాపారులు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రతి పంటను ఈనామ్ ద్వారా కొనుగోలు చేయాలని, వ్యాపారస్తులు సిండికేట్ కాకుండా చర్యలు చేపట్టాలని, మార్కెట్లో జీరో దందా వ్యాపారం అరికట్టి, మార్కెట్ సెస్స్ ను ఎగనామం పెట్టే పద్ధతిని స్వస్తి పలకాలని, మార్కెట్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగాము జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, పట్టణ కార్యదర్శి మంగ భీరయ్య, నక్క యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకారుల సేవలు బేష్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మత్స్యకారుల సేవలు అభినందనీయమని ఎస్సై అన్నారు. చేర్యాల మండలంలోని వెచరేణి గ్రామానికి చెందిన ఎగుర్ల సాయిబాబు శుక్రవారం వారి వ్యవసాయ భావి వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన చేర్యాల మండలంలోని వేచరేని చెరువులో చనిపోయాడు. విషయం తెలుసుకున్న కొమరవెల్లి ఎస్సై పిలుపు మేరకు ఐనాపూర్ గ్రామానికి చెందిన మత్స్యశాఖ సొసైటీ ఆధ్వర్యంలో వెచరేణి చెరువులో గాలింపులు చేపట్టారు. మల్లం బాలయ్య, కొంతం నరేష్, చీకోటి ప్రభాకర్, బాలయ్య వెల్లి శవాన్ని వెలికి తీశారు. వారి సేవలను ఎస్సై కొనియాడారు.

## గుడుంబా స్థావరాలపై దాడి

**ఆదిలాబాద్, మన చౌరాస్తా :** ఆదిలాబాద్ జిల్లాలో బోథ్ మండలంలో గుడుంబా స్థావరాలపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీసాయి తెలిపారు. శనివారం బోథ్ మండలంలోని బాబేర, నిగిని, కంటెగాం గ్రామాలలో విశ్వసనీయ సమాచారం మేరకు దాడు చేసినట్టు తెలిపారు. బాబేర గ్రామానికి చెందిన రాథోడ్ ఉత్తమ్, నిగిని గ్రామానికి చెందిన ఆడె గన్ను, కంటెగాం గ్రామానికి చెందిన ఆడె దత్తు అనే వ్యక్తులు కేసులు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా గుడుంబా కలిగి ఉన్న, తయారు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## గణనాథుడికి పూజలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా పట్టణంలో జ్యోతి నగర్ కాలనీలో జై హనుమాన్ అసోసియేషన్ ప్రతినిధి బాల్దె దేవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

## ఓటర్ జాబితాపై గ్రామాల్లో సమీక్ష



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొమురవెల్లి మండ కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ల తుది జాబితాపై గ్రామ స్థాయి వార్డుల వారిగా సమీక్ష జరిపారు. ఈ అఖిల పక్షసమావేశంలో బీజేపీ కొమురవెల్లి మండల పార్టీ అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప, మండల ప్రధాన కార్యదర్శులు బొడుగం కృష్ణారెడ్డి, ఎక్కల్ దేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

## జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్

**జనగామ, మన చౌరాస్తా** : జనగామ పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. శనివారం జనగామ మున్సిపాలిటీకి కమిషనర్‌గా వచ్చిన డి.మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో ఉన్న ప్రధాన మున్సిపాలిటీని అభివృద్ధి చేసే విధంగా ఈ ప్రజా ప్రభుత్వంలో మన అందరం భాగస్వాములు కావాలని కోరారు. అదేవిదంగా పట్టణంలో శానిటేషన్, డ్రైనేజ్, వీధి దీపాలపై కమిషనర్‌కు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బొట్ల నర్సింగరావు, మాజీ కౌన్సిలర్లు బొట్ల శ్రీనివాస్, మంత్రి సుమలత శ్రీశైలం, జిల్లా కాంగ్రెస్ నాయకులు చెంచారపు కరుణాకర్ రెడ్డి, వివిధ వార్డుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందడి సంజీవి రెడ్డి, మచ్చ ప్రవీణ్, విజయ్ కుమార్, గంగుల మల్లారెడ్డి, కడారు ప్రవీణ్ కుమార్, ముజ్జు, మిద్దెపాక స్టాలిన్, గదెపాక ప్రసాద్, కమల్, బూరెల్లి సిద్ధులు, బుష పర్వతాలు, నోముల సోమయ్య, ఉలెంగుల్ల మధు, ఉలెంగుల్ల శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాశ్ యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత, మైనారిటీ నాయకులు ఇస్మాయిల్, నాయకులు తుపాకుల రాములు, రఘు, అండాలు, రాజు, అరవింద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## హుస్నాబాద్‌లో బీజేపీ నిరసన

- **రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన మాతృమూర్తిపై దూషణలు చేశారని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ 'ఒక్క పేద తల్లి కుమారుడు దేశాన్ని 11 ఏళ్లుగా అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక మోదీ తల్లిపై దూషణలు చేయడం సిగ్గు చేటు' అన్నారు. రాజకీయ విమర్శలు ఉండవచ్చని, కానీ చనిపోయిన తల్లిని దూషించడం రాజ్యాంగ విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధానికి ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోగా, ఇరువురి మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోల్లపెల్లి వీరాచారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్, బీజేపీ నాయకులు వేల్పుల నాగార్జున్, కాదాసు దీపికా, గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారి, వడ్డెపల్లి లక్ష్మయ్య, రైనా నాయక్, వేముల దేవేందర్ రెడ్డి, తోట సమ్మయ్య, కురిమెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## రాహుల్ దిష్టిబొమ్మ దహనం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** ప్రధాని నరేంద్ర మోడీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. కొమురవెల్లి మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షురాలు బూరుగోజు స్వరూప ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ బీహార్ కాంగ్రెస్ ఆర్జెడి ఎన్నికల ర్యాలీలలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొని ప్రధానమంత్రి మోడీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రాహుల్ వెంటనే క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కుడి మల్లేశం, బ్రాహ్మణులపల్లి బాబు, పప్పోజు రాజుచారి, మండల ప్రధాన కార్యదర్శిలు బుడగం కృష్ణారెడ్డి, ఎక్కాలి దేవి శ్రీనివాస్, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిగురుమామిడి పీఎస్‌ను తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ




**చిగురుమామిడి, మన చౌరాస్తా :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పరేడ్ ను స్వీకరించి, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆవరణలో నిలిపిన స్వాధీనం చేసిన వాహనాల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడుతూ వారికి అప్పగించిన విధులు, దస్త్రాల నిర్వహణ, కేసుల నమోదు పూర్తి స్థాయిలో జరగాలని సూచించారు. తెలంగాణ పోలీసులు వినియోగిస్తున్న వివిధ సాంకేతిక విధానాలను సమర్ధంగా నేర్చుకుని, రోజువారీ పనుల్లో వాడుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలను విభజించి, ఒక్కో అధికారిని వాటికి బాధ్యులుగా కేటాయించాలని సూచించారు. కొత్తగా చేరిన కానిస్టేబుళ్లు విధులన్నింటిని నేర్చుకోవాలని, దస్త్రాల నిర్వహణ, స్వీకరణ కౌంటర్ విధులు, కోర్టు విధులు, మద్యం తాగి వాహనం నడిపే వారిపై తనిఖీలు, బీట్, పహారా విధులను సీనియర్ల నుంచి తెలుసుకోవాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన ప్రతి పోలీసు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచి, వారిపై ప్రతి నెలా కొత్త సమాచారం సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో దస్త్రాల నిర్వహణ, పర్యవేక్షణ సంతృప్తికరంగా ఉందని పేర్కొన్న కమిషనర్ ఎస్సై సాయికృష్ణను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ వృత్తాధికారి సదన్ కుమార్, ఎస్సై సాయికృష్ణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# చిరుతో.. వెంకటేశ్ చేరేది అప్పుడే

'మన శంకరవరప్రసాద్ గారు'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన -టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. హీరో వెంకటేశ్ ఇందులో ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నట్లు- అనిల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా కోసం ఆయన వచ్చే నెల మధ్య నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు- సమాచారం. హైదరాబాద్‌లో మొదలు కానున్న ఈ కొత్త షెడ్యూల్ కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. ఈ కథలో వెంకీ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని.. చిరుతో పాటతో పాటు- యాక్షన్ సీక్వెన్స్‌లోనూ భాగమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. వినోదం, యాక్షన్ అంశాల మేళవింపుతో సాగే ఈ కుటుంబ కథా చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.





# ఎమోషనల్ స్టోరీ లైన్‌లో ఘాటీ

స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఎప్పుడు ఎప్పుడు విడుదల అవుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమా పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఇక ఇప్పుడు ఈ చిత్రం సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అయింది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్ కూడా శరవేగంగా జరుపుతున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రం తాజాగా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. కాగా ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమాలో శీలవతి పాత్రలో అనుష్క స్టన్నింగ్ పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్ర రన్-టైమ్‌ను 2 గంటల 37 నిమిషాలకు లాక్ చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయని చిత్ర యూనిట్ వెల్లడిరచింది. ఈ సినిమా కథ ఎమోషనల్ జర్నీగా ప్రారంభమై, ఇంటర్వెల్ వరకు సున్నితంగా నడిచినప్పటికి, ఇంటర్వెల్ తర్వాత మాత్రం ఆడియన్స్‌ను పూర్తిగా షాక్‌కు గురిచేయడం ఖాయం అంటున్నారు. ఇంటర్వెల్ తర్వాత కథ ఒక్కసారిగా అతి తీవ్ర యాక్షన్ మోడ్ లోకి వెళ్లి, గంజాయి మాఫియా నేపథ్యం పై రగిలే కథతో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టనుందట. కోట్లాది అభిమానులను సంపాదించుకున్న అనుష్క పెద్దగా సినిమాలు చేయక పోవడంతో, ఆమె అభిమానులు కొత్త సినిమా కోసం చాలా రోజులుగా ఎదురు చూస్తున్నారు.




# మిరాయ్ చిత్రంపై అంచనాలు పెంచిన ట్రైలర్

ఈ మధ్యకాలంలో వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలు కూడా గ్రాఫిక్స్ విషయంలో నెటిజన్లను మెప్పించలేక ట్రోలింగ్ బారిన పడుతున్నాయి. కానీ యంగ్ హీరో తేజ సజ్జ పరిమిత బడ్జెట్‌లోనూ వావ్ ఫ్యాక్టర్ ఉన్న విజువల్ సినిమాలతో సూపర్ హీరోగా ఎదుగుతున్నాడు. 'హనుమాన్' తర్వాత ఆయన జాగ్రత్తగా సినిమాలు ఎంచుకుని, పాన్ ఇండియా ప్రేక్షకులకు యూనివర్సల్ కంటెంట్ అందిస్తున్నాడు. తాజాగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'మిరాయ్' ట్రైలర్ రిలీజ్ అయింది. కేవలం మూడు నిమిషాల -ట్రైలర్ మాత్రమే అయినా, సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచింది. ప్రారంభం నుండి ముగింపు వరకు ప్రతి ఫ్రేమ్ గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉంది. ఈ మధ్యకాలంలో ఇంత యునానిమస్ పాజిటివ్ రెస్పాన్స్ పొందిన -ట్రైలర్ మరొకటి రాలేదని చెప్పాలి. -ట్రైలర్‌లో హీరో తేజ సజ్జ, విలన్ కోసం వెతికే తొమ్మిది శక్తివంతమైన గ్రంథాలు, వాటిని అడ్డుకునే యోధుడి పోరాటం, ఎనర్జిటిక్ యాక్షన్ స్టంట్స్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ అందించిన విధంగా సన్నివేశాలు ఉన్నాయి. యోధుడిగా కనిపించబోతున్న తేజ.. మరోసారి సూపర్ హీరోగా -ట్రైలర్‌తో సక్సెస్ అయ్యాడు. -ట్రైలర్ చివర్లో శ్రీరాముడు షాట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో సోషల్ మీడియాలో ప్రశంసలు పొందుతోంది. ఈ సినిమాలో డైనమిక్ హీరో మంచు మనోజ్, సీనియర్ హీరోయిన్ శ్రియ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొత్తంగా, ఈ ఫాంటసీ యాక్షన్-అడ్వెంచర్ సినిమా పాన్ ఇండియా ప్రేక్షకులకు అంచనాలను పెంచుతూ, సెప్టెంబర్ 12న బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడానికి సిద్ధంగా ఉంది.